# ఆశయ సిద్ధి

"మరీయింత ముక్కుకు సూటిగా నడుచుకుంటే ఎలాగండి శివరామయ్యగారూ! మనిషన్న తరువాత కాస్త ముందుచూపు కొంచెమో గొప్పో వెనకేసుకోడానికి చూడాలి. రాబోయే కాలం ఎలాగుంటుంది ఎవరు చెప్పగలరు?" అని ఎవరైనా మందలిస్తే శివరామయ్య ఆ సలహాను తేలిగ్గా తీసుకుని నవ్వేసేవాడు.

"పరవాలేదు లెండి! బ్రతకలేకపోను" అంటుండేవాడు. అతడి సంపాదన బొటాబొటీగా సంసారానికి సరిపోతూ వుండేది. కుమార్తెకు పెళ్లి చేయవలసి వచ్చేసరికి అప్పు చేయక తప్పింది గాదు. నెలనెలా యాభై రూపాయల చొప్పున చెల్లించుకుంటే ఆ అప్పే ముందుగా తీరుతుందో లేక తానే ముందుగా రిటయిరై పోతాడో శివరామయ్యకు తెలియదు.

ఎందుకు తెలియదంటే అతడెప్పుడూ ఆ విషయాన్ని గురించి ఆలోచించలేదు కనుక!

శివరామయ్య ఆత్మవిశ్వాసానికంతా పునాది అతడి నీతి. ఇతరుల ఎదుట తలవంచుకోవలసిన పనేది తాను చేయలేదు. తాను ముందుగా వెళ్తుంటే వెనకవైపున వున్నవాళ్ళు తనను చూసి హేళనగా ఈసడింపుగా మాట్లాడుకునే అవకాశాలు లేవు. ఒళ్ళు దాచుకోకుండా పనిచేసి పై అధికారులను మెప్పించి ఆఫీసులో అందరికీ తాను తలలో నాలుకలా మసలుకున్నాడు. ఈ నిర్భయమైన చిత్తవృత్తి శివరామయ్యకు బాగానే ఉపకరించింది. మొక్కవోని ధైర్యంతో అతడు జీవితాన్ని ఎదుర్కొంటూ వచ్చాడు.

శివరామయ్య ఆత్మవిశ్వాసం ఒకించుక సడలి పోవడానికి కారణభూతమైన సంఘటన నాలుగైదేళ్ళ క్రితం జరిగింది. అదే కమలమ్మ కనుమరుగు కావటం. మగవారికి అందులోను నీతిమంతుడయిన మగవాడికి సహధర్మిణికన్నా పలుకు తోడుగానీ, తోడునీడగానీ మరేముంటుంది? ఐతే ఒకటి. శివరామయ్య వాస్తవిక దృక్పథం, చావుకు సైతం అలౌకిక కారణాలను ఊహించడానికి నిరాకరించింది. దైవానుగ్రహం అంతలో వుంది అని అతడనుకోలేదు. ఆమె అడిగి వచ్చిన రాత అంతే! అని నిట్టూర్చలేదు. ఆవిడ ఆరోగ్యం అంతంత మాత్రం. ఎంతో కొంత జబ్బును నిరోధించేశక్తి ప్రతి శరీరంలోనూ వుండనే వుంటుంది. ఆ శక్తి సన్నగిల్లి జబ్బుదే పైచెయ్యి అయినప్పుడు శరీరానికెదురయ్యే పరిస్థితినే మృత్యువు అంటారు. దాని నుంచి తప్పించుకోడం ఎవరితరం! లేదంటే ఆవిడకాస్త ముందుగా వెళ్ళిపోయింది అంతే!

"ఒంటరిగా ఎలా వుంటావు నాన్నా? వచ్చి మాతోగూడా వుండిపోగూడదూ?" అంది రేవతి. ఆమె శివరామయ్య ఏకైక సంతానం.

"ఎందుకులేమ్మా! ఎలాగూ రెండు మూడేళ్ళలో రిటయిరైపోతున్నాను. నా ఉనికిలో మార్పు ఏదయినా అవసరమనిపిస్తే తరువాత ఆలోచిద్దాం" అన్నాడు శివరామయ్య.

ఉద్యోగ విరమణ పొందిన క్రొత్తలో కొంతకాలం పాటు శివరామయ్యకు నిజంగా మతిపోయినట్టే వుండిపోయింది. అన్ని వారాలూ ఆదివారాలుగానే తోచి కాలం అతన్ని భయపెట్ట సాగింది. శుష్కంగా శూన్యంగా ఎదురైన నిర్వ్యాపకత్వం కౌగలించుకోబోయిన భూతంలా అతణ్ణి బెదరగొట్టింది. ఇంటికి తాళం పెట్టి తనవాళ్ళ మధ్యకు వెళ్ళి వాలిపోయిన తర్వాతగానీ అతడు ఊపిరి తిప్పుకోలేకపోయాడు. 'వచ్చేశావా నాన్నా! మంచి పనే చేశావు. యింత కాలానికయినా నీకు మామీద మనసు మళ్ళింది" అంది రేవతి గూడా!

నాలుగయిదు రోజులు హాయిగా గడచిపోయాయి. హాయిగా గడిచినవి ఆ నాలుగయిదు రోజులు మాత్రమే. పూల చెట్ల నడుమ చిన్నమేడ. పైనా క్రిందా కలసి ఏడెనిమిది గదులు, విశ్రమించడానికి మించిన జీవిత పరమార్థం లేదన్నట్టుగా పట్టెమంచాలూ, సుఖాసనాలు, బీరువాల నిండా బట్టలు, వంటగది నిండా స్టెయిన్‌లెస్ స్టీలుపాత్రలు, ఒక్కొక్క వ్యక్తికి నాలుగయిదు రకాల పాదరక్షలు, రుచిగా వండిపెట్టడానికి వంటలక్క, కాలిపని, చేతిపని చేసిపెట్టడానికి పనిమనిషి, బయటికి వెళ్ళాలంటే రిక్షా, సినిమాకు వెళ్తే కొనేది మొదటి తరగతి టిక్కెట్లు, మానవ మాత్రుల కింతకన్నా కోరదగిన హాయి ఏముంది?

పోని ఆదరణలో లోపముందనుకుందామనుకుంటేనా, ఆ మాట తలపెట్టడమే అన్యాయం. ఉదయం ఆరింటికల్లా కాఫీ రెడీ, స్నానమయ్యే సరికి టిఫిన్ సిద్ధం, ప్రొద్దు తిరగక ముందే భోజనం తయారు. సర్వ సదుపాయాలకూ కుదురుగా ఉన్న ఆ యిల్లు శివరామయ్యకు నల్లులు చేరిన పడకలా అశాంతి ప్రదం కావడమే విడ్డూరం!

వచ్చిన చిక్కంతా శివరామయ్య బుద్ధిజీవి కావడం దగ్గరే వచ్చింది. అల్లుడు చేస్తున్న ఉద్యోగమేమిటి అంటూ అతడు తనకు తానే ప్రశ్నించుకున్నాడు. ఆ ఉద్యోగం మూలంగా ముట్టే నెలసరి జీతం ఏ పాటిది? జీవితావసరాల క్రింద, వినోద విలాసాల క్రింద ఈ కుటుంబానికవుతున్న ఖర్చెంత? జీతానికి కొన్ని రెట్లెక్కువగా ఖర్చు చెయ్యగల ఆర్థికస్తోమత వీళ్ళకెలా వచ్చింది? ఎక్కడినుండి వచ్చింది? ఈ జిజ్ఞాస ప్రారంభం కావడమే తరువాయి, శివరామయ్య మనస్సు తలుపులు, కిటికీలు మూసి ముంత పొగ పెట్టినట్టుగా అలజడితో, ఆందోళనతో నిండిపోయింది. అది మృష్టాన్నంగాదు, విషాన్నం. అది పట్టె మంచం కాదు, కంటకశయ్య. ఈ వైభోగమంతా బొత్తిగా పునాదులు లేకుండా కట్టిన పెద్ద కట్టడం. ఏ క్షణాన్నయినా యిది కూలి పోయేదే!

శివరామయ్యకిక ఆ వాతావరణంలో యిమడడం అసాధ్యమనిపించింది. రెండు రోజుల్లో తిరిగొస్తానని చెప్పి అతడక్కడినుంచి దూసుకున్నాడు. తన స్థావరం తాను చేరుకున్నాక, అక్కడి నీళ్ళు తన ఆరోగ్యానికి సరిపడడం లేదంటూ ఓ వుత్తరం ముక్క వ్రాసి పడేసి, అపార్థాలకు తావేర్పడకుండా చూచుకున్నాడు.

రాబందు రెక్కల నీడలాంటిదేదో తనపైకి పరచుకుంటున్నట్టుగా శివరామయ్య మనసులో ఒక భయం చోటు చేసుకోసాగింది. అగాధం అంచున నిలబడి పిల్లిమొగ్గలు వేస్తారా ఎవరైనా! అల్లుడింత అవివేకంగా ప్రవర్తించగలడని తానెప్పుడూ అనుకోలేదు. ఆ ఉద్యోగం వూడిపోవచ్చు. కేసు కోర్టు కెక్కితే శిక్ష గూడా పడొచ్చు. ఉన్న వస్తువు

లొక్కొక్కటిగా అమ్ముకుంటేనేగానీ రోజులు గడవని దుస్థితి దాపురించవచ్చు. నలుగురిలో నగుబాట్లు. సాటివారిలో తలవంపులు. ఆ పరిణామాన్ని గురించి తలచుకున్నప్పుడల్లా శివరామయ్య మనసులో మనసు నిలవక కుమిలిపోయేవాడు. క్రమేపీ నిద్రకూడా కరువై పోసాగింది. శివరామయ్య జీవితంలో తనకోసమంటూ తానెప్పుడూ భయపడినవాడు కాదు. అతడి బలహీనత ఎక్కడుందో కనిపెట్టి అంతరాత్మ అతణ్ణి 'బ్లాక్ మెయిల్' చేయసాగింది. లోలోపల నుంచీ అతణ్ణి తొలిచివేస్తున్న ఈ మనోవ్యాకులాన్ని పసికట్టిన వాళ్ళెవరూ లేరు. ఎదురైన ప్రతి స్నేహితుడూ డాక్టరు దగ్గరికి వెళ్ళి ఆరోగ్య పరీక్ష చేయించుకోమని శివరామయ్యపైన ఒక ఉచిత సలహా గుప్పించసాగాడు. తన విషయంలో డాక్టర్లు చేయగలిగిందేమీ లేదని శివరామయ్యకు తెలుసు. కానీ మానసికంగా బలహీనుడైపోయిన దశలో మానవుడు కొన్ని అసంగతమైన పనులు చేయనే చేస్తాడు.

శివరామయ్య శరీరాన్ని క్షుణ్ణమైన పరీక్షకు గురిచేసిన తర్వాత అనుభవజ్ఞుడైన డాక్టరు అతడివైపు అయోమయంగా చూస్తూ "ఇదేమిటో చిత్రంగానే వుంది. మీలో చెప్పుకోదగ్గ జబ్బేదీ నాకు కనుపించడం లేదు" అన్నాడు.

"నేనూ అలాగే అనుకుంటున్నాను" అన్నాడు పేషంటుగూడా డాక్టరుగారితో ఏకీభవిస్తూ.

"లేదండీ, ఏదో బెంగతో మీరు క్రుంగిపోతున్నట్టున్నారు. ఇంట్లో ఒంటరిగా కూచోడంవల్ల ఎన్నెన్ని విచారాలైనా మనిషి చుట్టూ క్రమ్ముకుంటాయి. మీరొక పని చేస్తారా శివరామయ్యగారూ?"

"చెప్పండి, ఏం చెయ్యమంటారు?"

"ఏం లేదు. మీకు దేవుడంటే నమ్మకముందో లేదో నాకు తెలియదు. నాకైనా భగవంతుణ్ణి గురించి ఏమీ తెలియదు. అయినా తీర్థయాత్రలకు వెళ్ళిరమ్మని నేను మీకు ప్రిస్క్రిప్షన్ యివ్వడానికిన్ని భగవద్భావనకున్నూ ఎట్టి సంబంధమూ వుండనక్కర్లేదు. యాత్రలకు వెళ్తే భగవంతుడి మాట ఏమిటోగాని, భగవత్సృష్టిని మాత్రం తనివితీరా చూడొచ్చు. మనకంటే హీనమైన పరిస్థితుల్లో వున్న వాళ్ళుంటారు. ఇంకా యింకా కష్టాల్లో, దుఃఖాల్లో మునిగి తేలుతుండే వాళ్ళుంటారు. ఎంతటి కష్టాలనైనా లెక్కపెట్టకుండా చేతుల బలంతో ఏటికెదురీత కొట్టే వాళ్ళుంటారు. అలాంటి వాళ్ళని చూడడం 'రిలీఫ్' కాదంటారా? కొన్ని కొన్ని మనోవ్యాధులకు అంతకంటే గొప్ప టానిక్కు వుండదని నా అభిప్రాయం..."

"సరేనండీ! ఆలోచిస్తాను." అన్నాడు శివరామయ్య.

కానీ శివరామయ్యకు నింపాదిగా ఆలోచించుకునే అవకాశం లేకపోయింది. అందుకు కారణం రేవతి దగ్గరినుంచి టెలిగ్రాంలా వచ్చిన వుత్తరం – "విశేషములన్నీ సముఖంలో చెప్పగలదానను. తక్షణము బయలుదేరి రావలెను."

ఎలాంటి అమంగళాన్ని గురించి వినవలసి వస్తుందోనని గుండెల్ని అరచేతిలో పెట్టుకునే వెళ్ళాడు శివరామయ్య. కుమార్తె ముఖం తేటగానే కనిపించినప్పటికీ అతడి అనుమానం మాత్రం అతణ్ణి వెంటాడకుండా వదలిపెట్టింది గాదు.

"ఏమిటమ్మా! ఏదైనా..."

"అబ్బే, అలాంటిదేం లేదునాన్నా..."

సాంకేతిక పరిభాషలో ప్రశ్నోత్తరాలు ముగిసిన తరువాత మనసు కాస్త స్థిమితపడింది.

మరైతే నిల్చున్న పళంగా బయల్దేరి రమ్మని తన కెందుకు కబురు పెట్టినట్టు?

"ఏం చెప్పమంటావు నాన్నా? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. భగవంతుడి దయవల్ల మాకు సిరిసంపదలకేం లోటులేదు. ఉండి ఏం లాభం? డబ్బు పెట్టినా కొనలేనివి చాలా వున్నాయని నాకిప్పుడిప్పుడే తెలిసివస్తోంది. అలాంటి వాటిలో చాలా ముఖ్యమైంది ఆరోగ్యం..."

"ఇప్పుడిక్కడ ఎవరి ఆరోగ్యాని కమ్మా ఢోకా వచ్చింది?" విస్తుపోతూ అడిగాడు శివరామయ్య.

"చూశావా నాన్నా! అదే తమాషా. చూడ్డానికేమో మేము నిక్షేపంగానే వున్నాం. మీ అల్లుడుగారికి బి.పి. అంటున్నారు. పదడుగులు నడిస్తే చాలు. ఆయనకాయాసం ముంచుకొస్తుంది. నాకిదేమిటో నరాల బలహీనతట! వారానికొకటి రెండుసార్లయినా తెలివితప్పి పడిపోతుంటాను. ఒక్కొక్కప్పుడు దాదాపుగా అరగంట సేపటివరకూ శవంలా అలా పడి వుండటమే! సంపాదనలో సగానికిపైగా మెడికల్ షాపులకే వెళ్ళిపోతోంది. ఇక మందులూ, సూదులూ లాభం లేదనుకున్నాం. నమ్ముతావో, నమ్మవోగానీ నాన్నా, మా కుటుంబానికేదో పీడ పట్టుకున్నట్టే వుంది. ఇక్కడ పట్నం శాస్తుర్లొకాయన వున్నారులే!... ఆయన్ను అడిగితే గ్రహాలు చాలవంటున్నాడు..."

"గ్రహాలు చాలకపోతే ఏం చేయాలటమ్మా?" శివరామయ్య దీనంగా ప్రశ్నించాడు.

"తీర్థాలకు వెళ్ళి రమ్మంటాడాయన! నాలుగు దేవుళ్ళను దర్శించి అర్చనలు అభిషేకాలు జరిపితే పీడా, గీడా విరగడై పోవచ్చునంటాడు..."

"మంచిపనేగదమ్మా! వెళ్ళి రావచ్చు గదా!" ఆ ప్రతిపాదనతో తనకేమీ సంబంధం లేనట్టుగా అన్నాడు శివరామయ్య.

"అబ్బే, అదిగాదు నాన్నా! ఆ మాత్రం తీరిక ఆయన కెలాగూ లేదు. మరింక నేనున్న పరిస్థితుల్లో యింటినుంచి కదల్లేను. అందుకనే నిన్ను పిలిపించడం! ఇంటికి పెద్దదిక్కుగావున్న వాడివి. మా అందరి తరఫునా నువ్వెళ్ళి వచ్చేయడం బాగుంటుంది..."

ఆశ్చర్యాతిరేకంతో శివరామయ్య కొంతసేపటివరకూ మ్రాన్పడి వుండిపోయాడు. అరవయ్యేళ్ళ జీవితంలో తనకెప్పుడూ తీర్థాటనం చెయ్యాలన్న ఉద్దేశం కలగలేదు. ఒకవేళ వెళ్ళవలసివస్తే మాత్రం అందుకు ఇలాంటి కారణం తోడు కావడమా! తప్పనిసరి చిత్రహింసకు గురైనట్టుగా అతడు "సరేనమ్మా అలాగే" అన్నారు.

శివరామయ్య ఒక శైవక్షేత్రం దగ్గరినుంచి తన యాత్రలకు శ్రీకారం చుట్టాడు. నదిలో గ్రుంకులిడివచ్చి నుదురు సోకేటట్టుగా లింగానికి సాష్టాంగ నమస్కారం గావించాడు. దగ్గర్లో ఎవరో గలగలా నవ్వినట్లయింది.

'మస్కా కొట్టడానికే గదా నమస్కారం' అదృశ్యఖడ్గంతో ఎవరో తలను కొట్టి పారవేసినట్టుగా అతడు కించపడిపోయాడు.

తరువాత మజిలీ ఒక వైష్ణవ క్షేత్రం. అక్కడ స్వామి పిలిస్తే పలికే దైవమని ప్రతీతి. మనుషులకేవైనా ఆపదలొస్తాయి. ఆయనకు మ్రొక్కుకుంటారు. ఆపదలు నివర్తికాగానే వచ్చి మొక్కుబడి చెల్లించుకుంటారు.

శివరామయ్య హుండి దగ్గర నిల్చుని జేబులో చేయివేశాడు. బరువుగా కట్టి పెట్టుకున్న పెద్దపొట్లాన్ని తీసి హుండీలో వేశాడు. అది లోపలదేనికి తగిలిందోగానీ, టంగుమని చప్పుడైంది, తలపైన టక్కుమంటూ మొట్టికాయ వేసినట్టు!

పనిపూర్తయిన తర్వాత చెల్లించుకునే దానిపేరు కానుక, పూర్తికాకమునుపే యిచ్చుకునేదేమిటి? లౌకిక వ్యవహారంలో దాన్ని 'లంచం' అంటారు.

శివరామయ్య మనస్సు చివుక్కుమంది. మానవుడు తప్పు చేయడంద్వారా తనను తానే అవమానించుకుంటున్నాడు. అంతటితో వూరుకోవటంలేదు. శిక్షకు గురికాకుండా ఆ తప్పును మాఫీ చేయించుకోడం కోసం ఏవేవో కృతకప్రయత్నాలు గూడా చేస్తున్నాడు. దేవుడనే వాడున్నట్టయితే ఈ మూర్ఖ మానవుల అవివేకాన్ని చూచి నవ్వుకోకుండా వుండడు.

ఇంకొక చోట అర్చన జరుగుతోంది. అయిదుంబావలా చెల్లించుకుంటే సహస్ర నామార్చన జరిపించడం ఆ క్షేత్రంలో రివాజు.

పూజారి పూజాకుసుమాలతో బాటుగా దేవుడిపైకి నామావళిని గుప్పిస్తున్నాడు. ఆయన పురుషోత్తముడు. శిష్టజన రక్షకుడు. అచ్యుతుడు ఇలా ఎన్నెన్నో విశేషణాలు. దేవుడు గనుక మానవుడి స్థాయికి దిగివస్తే, ఆ పొగడ్తల తాకిడికి ఉక్కిరిబిక్కిరి కావలసిందే.

కానీ అవన్నీ సార్థక నామాలయితేనే యిబ్బంది! ఆయన పురుషోత్తముడయితే కాపురుషుల్ని ఎలా మన్నిస్తాడు? శిష్ట రక్షకుడు దుష్ట కార్యాలనెలా అంగీకరిస్తాడు? అచ్యుతుడైనవాడు తెలిసి తెలిసీ ధర్మచ్యుతులైపోతున్న మానవుల చర్యల్ని హర్షించాలని ఏముంది?

తుఫాను అలజడిలో గిరికీలు కొడుతున్న పావురంలా శివరామయ్య బుద్ధి వికలమైపోసాగింది. ముందుకు వెళ్ళడానికి నిరాకరించిన సికిందర్ సైన్యంలా అతడి మనస్సు క్షేత్రాటనంపట్ల వెనుకాడసాగింది. ఈపని తనకేమంత ఆమోదప్రదంగా లేదని ఉత్తరం వ్రాసి, అతడు చక్కా స్వగ్రామానికే బిచాణా ఎత్తేయాలని అనుకుంటూ వుండగా రేవతినుంచే ఉత్తరం వచ్చింది.

తక్షణం బయలుదేరిన శివరామయ్య తిరిగి వచ్చి స్టేషనులో దిగేసరికి ఓ తెలిసిన వ్యక్తిద్వారా ఆ దుర్వార్త కాస్తా చెవిన పడింది. అల్లుడి ఉద్యోగం ఊడిపోయిందట.

"తీర్థయాత్రలకు వెళ్ళి రావడంవల్ల మేలు జరగకపోతే పోనీ కీడు జరిగిందెందుకు నాన్నా?" అని వాపోతుండేది రేవతి.

శివరామయ్య మౌనంగా వుండిపోయేవాడు. ఏదికీడో, ఏదిమేలో ఋజువు చేయవలసింది కాలమేనన్నది అతడి అభిప్రాయం.

కుటుంబ పోషణ కోసం శివరామయ్య అల్లుడు ఒక సేల్సు ఏజెంటుగా కుదురుకోవలసి వచ్చింది. పనిమనిషి నిలిచిపోవడంవల్ల రేవతి స్వయంగా యింటి పనులన్నీ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఎవరి వ్యాసంగాలతో వారికి సరిపోవడంవల్ల

జబ్బుల్ని గురించి బెంగపడే అవకాశం బాగా సన్నగిల్లిపోయింది. ఆదరణ బొత్తిగా లేకపోవడంతో ఆ జబ్బులుకూడా క్రమక్రమంగా కొండెక్క సాగాయి.

అన్నింటికన్నా ముఖ్యమైన సంగతి శివరామయ్యకు గూడా ఆరోగ్యం కుదుట పడడం.

మరైతే కొన్ని నిజాలు మాత్రం చాలా నిష్ఠూరంగానే వుంటాయి. తీర్థయాత్రల వల్ల చేకూరింది సత్ఫలితమేనన్న సత్యాన్ని శివరామయ్య ఎవరికీ చెప్పకుండా తనలోనే దాచుకున్నాడంటే అందులో ఆశ్చర్యం ఏముంది?

♦ *'జాగృతి' దీపావళి సంచిక - 1978* ♦